



DD9 వార్త
తెలుగు దినపత్రిక

# ఆర్టీసీ సమ్మెకు కౌంట్‌డౌన్



**TGSRTC సమ్మెకు కౌంట్‌డౌన్ ప్రారంభం**
**మరో 48 గంటల్లో సమ్మె సైరన్ మోగే అవకాశం**
**డిపోల స్థాయిలో సమ్మె సన్నాహాలు పూర్తి**
**RTC జేఏసీ నేతల నుంచి ఆందోళన హెచ్చరిక...**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణలో ఆర్టీసీ సమ్మెకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మరో 48 గంటల్లో సమ్మె సైరన్ మోగించే అవకాశముందని RTC కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే డిపోల స్థాయిలో సమ్మెకు సన్నాహాలు పూర్తయ్యాయని, అవసరమైతే ఎప్పుడైనా ఆందోళన ప్రారంభిస్తామని

..మిగతా 2లో

సంపుటి : 02 సంచిక : 241 హైదరాబాద్, ఏప్రిల్, మంగళవారం 21, 2026 పేజీలు : 05 వెల : 3.00



# పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా..?

**తెలంగాణలో గతంలో భయంకర పరిస్థితులు ఉండేవి**
**తెలంగాణ పదం అసెంబ్లీలో మాట్లాడవద్దని రూలింగ్ ఇచ్చారు..**
**మిషన్ భగీరథ ఎందుకు కుంటుతుంది... లాగులు పగిలేలా కొట్టాలి**
**కేసీఆర్ సావాలి అంటున్నారు.. నేను సావను..**
**బీఆర్ఎస్ కేవలం 1.7శాతం తేడాతో ఓడింది...**
**రియల్ ఎస్టేట్ పడిపోయింది**
**రైతులకి ఇస్తామన్న బోనస్ బోగస్ అయింది : కేసీఆర్**

**జగిత్యాల, (డిడి9 వార్త):** జగిత్యాల వేదికగా జరిగిన బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తన మరణం కోరుకుంటున్న వారికి తనదైన శైలిలో సమాధానమిస్తూనే, రాష్ట్రంలో ప్రస్తుత పాలనలోని వైఫల్యాలను ఎండగట్టారు. తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ.. "ఒకప్పుడు అసెంబ్లీలో తెలంగాణ అనే పదం వాడటానికే వీల్లేకుండా రూలింగ్ ఇచ్చేవారు. బషీర్‌బాగ్ కాల్పుల్లో రైతులు చనిపోయినప్పుడు భరించలేక పార్టీ పెట్టి బయలుదేరాను. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని చావు నోట్లోకి వెళ్లి రాష్ట్రాన్ని సాధించాను" అని కేసీఆర్ భావోద్వేగంగా మాట్లాడారు. ఇప్పుడు కొందరు కేసీఆర్ చావాలని కోరుకుంటున్నారని, కానీ పిల్లి శాపాలకు ఉట్లు తెగవని, తాను ఇప్పుడప్పుడే చావనని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభంపై కేసీఆర్ ఘాటుగా స్పందించారు. "మేము అధికారంలో ఉన్నప్పుడు కరెంటు సక్కగా ఉండేది. ఇప్పుడు కరెంటుకు ఏ రోగం వచ్చింది? ఏమైనా కాకి ఎత్తుకపోయిందా?" అని ప్రశ్నించారు. 20 వేల మెగావాట్ల విద్యుత్

..మిగతా 2లో



## రాష్ట్ర పునర్నిర్మాణం కేసీఆర్‌తోనే సాధ్యం

**అభివృద్ధికి రాజకీయాలు లేవు**
**10 జిల్లాల తెలంగాణ రాష్ట్రాన్ని 23 జిల్లాలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే**
**రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కూడా కేసీఆర్‌దే**
**కేసీఆర్ జగిత్యాలకు వస్తే.. అప్పుడే నిద్రలేచినట్టు రేవంత్ రెడ్డి నటిస్తున్నారు. - జీవన్ రెడ్డి**



2

# గచ్చిబౌలిలో అగ్నిప్రమాదం..

**సెల్లార్‌లో షార్ట్ సర్క్యూట్‌తో 15 ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న టిఎన్జీవో కాలనీలో సోమవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఒక అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో భారీగా

..మిగతా 2లో



**గచ్చిబౌలిలో అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో అగ్నిప్రమాదం**
**ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు ప్రారంభం**
**అపార్ట్‌మెంట్ అంతా దట్టమైన పొగ**
**పొగ పీల్చడంతో ఇద్దరు నివాసితులకు అస్వస్థత..**

# కేసీఆర్ పగటి కలలు మానుకోవాలి..

**బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**
**ప్రత్యేకంగా కే. చంద్రశేఖర్ రావు కుటుంబంపై ఆరోపణలు**
**ప్రాజెక్టుల రీ-డిజైన్ పేరుతో అవినీతి జరిగిందని వ్యాఖ్య**
**ప్రాజెక్టుల పేర్లు, స్థలాలు మార్చినట్టు ఆరోపణ**
**కమీషన్ల కోసమే మార్పులు చేశారన్న విమర్శ**
**ఆర్థిక లాభాల కోసం "డ్రామా" ఆడారన్న అభిప్రాయం**
**కాంగ్రెస్ ప్రాజెక్టులకు గుర్తింపు రాకూడదని ఆరోపణ**
**కాళేశ్వరం కేసీఆర్ అవినీతికి సాక్ష్యం..**
**బీఆర్ఎస్ ప్రభుత్వం మార్పులు చేసిందన్న విమర్శ**



**మేడిగడ్డ, (డిడి9 వార్త):** తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి వస్తానని భ్రమపడుతున్నారని, కానీ తెలంగాణలో ఆ కుటుంబం శకం శాశ్వతంగా ముగిసిపోయిందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అవినీతి, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఎలాగైతే తిరస్కరించారో, 2029 ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ఆర్ - డి.శ్రీనివాస్ జోడీ కాంగ్రెస్‌ను వరుసగా ఎలా గెలిపించిందో, ఇప్పుడు తాను - పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కలిసి రెండోసారి కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేరుస్తామని ఆయన శపథం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం అని, వారిచ్చిన తీర్పును గౌరవించకుండా కేసీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడటం ఆయన భ్రమలకు నిదర్శనమని రేవంత్ మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలు 'చిల్లర మాటలు' అంటూ కొట్టిపారేసిన సీఎం, రాష్ట్ర ప్రజలు కల్వకుంట్ల కుటుంబాన్ని ఎప్పటికీ క్షమించరని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే తమను మళ్లీ గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లిందని, ఇకపై తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ హవా మాత్రమే కొనసాగుతుందని రేవంత్ రెడ్డి కార్యకర్తల సాక్షిగా ప్రకటించారు. విపక్షాల విమర్శలకు తాము

..మిగతా 2లో

# కేసీఆర్ సభకు హరీశ రావు గైర్హాజరు..

**చాలా రోజుల తర్వాత జగిత్యాలలో కేసీఆర్ బహిరంగ సభ**
**ఈ కీలక సభకు దూరంగా హరీశ్ రావు.. హుటాహుటిన ఢిల్లీకి**
**కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయసలహా కోసం పయనం**
**ఎమ్మెల్యేల ఫిరాయింపులపైనా న్యాయపరమైన కార్యాచరణకు సన్నాహాలు**
**హరీశ్‌తో పాటు వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర కూడా ఢిల్లీకి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** చాలా రోజుల విరామం తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ ప్రజల్లోకి వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఆయన ఇవాళ జగిత్యాలలో నిర్వహించనున్న 'బీఆర్ఎస్ ఆశీర్వాద సభ'లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఇందుకోసం సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి ఆయన బయలుదేరనున్నారు. అయితే, పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ సభకు కీలక నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గైర్హాజరు కావడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో

..మిగతా 2లో



## అంధకారంలో హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు

**హరీశ్ రావు మానసిక వేదనతో బాధపడుతున్నారన్న తుమ్మల**
**జరుగుతున్న అవమానాలవల్లే ఆయన స్థితి ఇలా తయారైందని వ్యాఖ్య**
**బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయినా అహంకారం తగ్గలేదని విమర్శ**



2

# గచ్చిబౌలిలో అగ్నిప్రమాదం..

మొదటిపేజీ తరువాయి

ఆస్తి నష్టం సంభవించినప్పటికీ, ప్రాణనష్టం తప్పింది.ప్రాథమిక సమాచారం ప్రకారం, అపార్ట్‌మెంట్ సెల్లార్ లోని ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు మొదలయ్యాయి. సెల్లార్‌లో పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలకు ఈ మంటలు వేగంగా అంటుకున్నాయి. నిమిషాల వ్యవధి లోనే అపార్ట్మెంట్ అంతా దట్టమైన నల్లటి పొగ కమ్మేసింది. పొగ కారణంగా పై అంతస్తుల్లో ఉన్న నివాసితులు ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

ఈ అగ్నిప్రమాద ఘటనలో సెల్లార్ లో పార్క్ చేసిన సుమారు 15 ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. పొగ పీల్చడం వల్ల అపార్ట్మెంట్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సమాచారం. సమాచారం అందిన వెంటనే గచ్చిబౌలి ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అపార్ట్మెంట్ లోపల చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. నిచ్చెనల సాయంతో పై అంతస్తుల నుంచి బాధితులను సురక్షితంగా కిందకు దించారు. అగ్నిమాపక యంత్రాలతో నీటిని చల్లి మంటలు ఇతర ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అటు అపార్ట్‌మెంట్ వాసులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం పోలీసులు ఆస్తి నష్టంపై అంచనా వేస్తున్నారు.



# పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా..?

మొదటిపేజీ తరువాయి

సామర్థ్యం ఉన్న రాష్ట్రాన్ని ఈ 'దరిద్రుల' చేతిలో పెడితే.. నేడు ప్రజలు చీకట్లో మగ్గుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో తాను హెచ్చరించినట్లే జరుగుతోందని కేసీఆర్ అన్నారు. "వీళ్లు గెలిస్తే దళిత బంధుకి జైభీమ్, రైతుబంధుకి రాం రాం అని చెబుతారని ముందే చెప్పాను ఇప్పుడు అదే జరుగుతోంది. రైతుబంధు డబ్బులు నెలల తరబడి వేస్తారా? రైతుల కష్టాలు వీళ్లకు పట్టడం లేదు" అని మండిపడ్డారు. ఇంటింటికి మంచినీళ్లు ఇచ్చే మిషన్ భగీరథ పథకాన్ని ఎందుకు కుంటుపడేలా చేస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించారు. ప్రజలకు నీళ్లు ఇవ్వడంలో విఫలమైతే.. "లాగులు పగిలేలా కొట్టాలి" అంటూ తనదైన శైలిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ ఉన్నంత వరకు ప్రజల పక్షాన పోరాటం ఆగదని, కాంగ్రెస్ వైఫల్యాలను నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు అన్నీ కోల్పోయామని బాధపడుతున్నారని, తెలంగాణ పునర్నిర్మాణం కోసం మరోసారి పోరాడాల్సిన సమయం వచ్చిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. జగిత్యాల బహిరంగ సభలో ఆయన ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ పార్టీ కేవలం 1.7 శాతం ఓట్ల తేడాతోనే ఓడిపోయిందని కేసీఆర్ గుర్తు చేశారు. "కొత్త ప్రభుత్వం వచ్చింది కదా, ఏదైనా చేస్తారని ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నాను. కానీ, వీళ్లు ఒక్కటంటే ఒక్కటైనా నిర్మాణాత్మకమైన పని చేశారా?" అని ప్రశ్నించారు. ప్రజలు ఆశపడి ఓటేస్తే, కాంగ్రెస్ వారిని నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు.

రైతుల పరిస్థితి రాష్ట్రంలో దారుణంగా మారిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "దుకాణాల్లో యూరియా లేదు కానీ యాప్‌లో వస్తుందట. యూరియా కోసం రైతులు చెప్పులు లైన్లో పెడుతున్నారు. రైతుబంధు రావాలంటే కేసీఆర్ సభ పెట్టాలా? రైతులకు ఇస్తామన్న బోనస్ కాస్త 'బోగస్' అయింది. మొక్కజొన్న కొనుగోలు చేసే దిక్కు లేదు" అని ధ్వజమెత్తారు. వ్యవసాయ బావులకు మీటర్లు పెట్టే విషయంలో ప్రభుత్వం ఇప్పటికే సంతకాలు చేసిందని ఆయన ఆరోపించారు.

హైడ్రా (HYDRAA) పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరుపై కేసీఆర్ తీవ్రంగా స్పందించారు. "ఏమిటి ఈ కూల్చివేతలు? కనీసం పిల్లల పుస్తకాలు కూడా తీసుకోనివ్వరా? మేము అధికారంలోకి రాగానే మొట్టమొదట హైడ్రాను పీకి పారేసే ఫైలు మీదనే సంతకం చేస్తాను" అని హామీ ఇచ్చారు. పీసీసీ అధ్యక్షుడు నిజామాబాద్ పోయి 'నిద్రా' తెస్తానంటున్నారని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోయిందని, చేనేత కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయని కేసీఆర్ ఆందోళన వ్యక్తం



చేశారు. "మేము ఉద్యోగులకు 72 శాతం పీఆర్సీ ఇచ్చాము, కానీ వీళ్లు 7 శాతం కూడా ఇవ్వలేకపోతున్నారు. ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు 12 వేల కోట్లకు చేరాయి. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ పోయించే తెలివి కూడా ఈ ప్రభుత్వానికి లేదు" అని విమర్శించారు.తెలంగాణ సమాజం ఇప్పుడు ఒక గందరగోళంలో ఉందని, ప్రజల పక్షాన నిలబడి ఈ 'దరిద్రపు పాలన'పై పోరాడుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

# ఆర్టీసీ సమ్మెకు కౌంట్‌డౌన్

మొదటిపేజీ తరువాయి



RTC జేఏసీ నేతలు తెలిపారు. ఇదిలా ఉంటే, సమ్మె అంశాన్ని ప్రభుత్వం అంతగా పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు RTC జేఏసీని అధికారిక చర్చలకు ఆహ్వానించకపోవడం కార్మికుల్లో అసంతృప్తిని పెంచుతోంది. అయితే ప్రభుత్వ వర్గాలు మాత్రం విలీనం, యూనియన్ల పునరుద్ధరణ మినహా మిగతా డిమాండ్లపై సానుకూలంగా ఉన్నామని చెబుతున్నాయి.

సమ్మె ప్రారంభమైతే ప్రజారవాణ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. లక్షలాది ప్రయాణికులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. అద్దె బస్సులతో పాటు పాఠశాల బస్సులను కూడా వినియోగించుకునే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇక సమ్మెను నివారించేందుకు కూడా కీలక చర్చలు జరగనున్నాయి. రేపు మంత్రి పొన్నం, RTC ఉన్నతాధికారులతో RTC జేఏసీ నాయకుల మధ్య సమావేశం జరిగే అవకాశముంది. ఈ చర్చల్లో సానుకూల ఫలితాలు వస్తాయా? లేక సమ్మె తప్పదా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# కేసీఆర్ సభకు హరీశ్ రావు గైర్హాజరు..

మొదటిపేజీ తరువాయి

తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పార్టీ ముఖ్య నేతలంతా జగిత్యాల సభ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండగా, హరీశ్ రావు మాత్రం పార్టీ నేతలు బి. వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్రతో కలిసి హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కేసీఆర్ సభ జరుగుతున్న రోజే ఈ కీలక నేతలు ఢిల్లీకి వెళ్లడం వెనుక బలమైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రెండు కీలకమైన న్యాయపరమైన అంశాలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చించేందుకే ఈ పర్యటన చేపట్టినట్లు పార్టీ వర్గాల సమాచారం.

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ పూర్తిచేసిన ధర్మాసనం, ఈ నెల 22న తుది తీర్పును వెలువరించనుంది. ఒకవేళ తీర్పు ప్రతికూలంగా వస్తే వెంటనే సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ముందస్తుగా న్యాయవాదులతో మంతనాలు జరిపేందుకు హరీశ్ రావు బృందం ఢిల్లీకి వెళ్లినట్లు తెలుస్తోంది.




దీంతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో స్పీకర్ తీర్పు అనంతరం చేపట్టాల్సిన న్యాయపరమైన కార్యాచరణపై కూడా ఈ పర్యటనలో చర్చిస్తున్నట్లు సమాచారం. ఓవైపు కేసీఆర్ బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తుండగా, మరోవైపు కీలక నేతలు న్యాయపోరాటాలకు సిద్ధం కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జగిత్యాల సభను విజయవంతం చేసేందుకు కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు భారీగా జన సమీకరణ చేపట్టారు.

# రీ-డిజైన్ పేరుతో భారీ దోపిడీ..

మొదటిపేజీ తరువాయి

జరిగిన ప్రచారాన్ని ఎద్దేవా చేస్తూ సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కాళేశ్వరం ప్రపంచంలోనే అద్భుతమని ప్రచారం చేసుకున్నారు. రాజకీయ లబ్ధి పొందేందుకు అప్పటి గవర్నర్ నరసింహన్‌తో హరీష్ రావు పేరును మార్చి 'కాళేశ్వర్ రావు' అని చెప్పించారు" అంటూ దుయ్యబట్టారు. ప్రాజెక్టు గొప్పతనం కంటే వ్యక్తిగత ఇమేజ్ కోసమే అప్పట్లో ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. కేసీఆర్ చేసిన అవినీతిని కాలమే గుర్తించిందని, అందుకే 2023 ఎన్నికల ముందే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని సీఎం పేర్కొన్నారు. "కేసీఆర్ పాపాలను ప్రకృతే బయటకు తీసింది. ప్రపంచ అద్భుతం అని చెప్పిన ప్రాజెక్టు గాలిలో కలిసిపోయింది" అని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అన్ని కోణాల్లోనూ విఫలమైందని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) తన నివేదికలో స్పష్టంగా పేర్కొందని సీఎం వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణం, నాణ్యత, ప్లానింగ్.. ఇలా ప్రతి విషయంలోనూ వైఫల్యాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ పర్యటనలో ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీఎం, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని మరోసారి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మంత్రులు, ఉన్నతాధికారులు , భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.




# అంధకారంలో హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు

- హరీశ్ రావు మానసిక వేదనతో బాధపడుతున్నారన్న తుమ్మల
- జరుగుతున్న అవమానాలవల్లే ఆయన స్థితి ఇలా తయారైందని వ్యాఖ్య
- బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయినా అహంకారం తగ్గలేదని విమర్శ



హైదరాబాద్, (డిడి9 వార్త):

బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిప్పులు చెరిగారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు వ్యవస్థలను దోచుకుని రాష్ట్రాన్ని రావణకాష్ఠంగా మార్చారని ఆరోపించారు. హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు అంధకారంలో ఉందని, అందుకే ఏం చేయాలో దిక్కుతోచక పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. "హరీశ్ రావు ప్రస్తుతం మానసిక వేదనతో బాధపడుతున్నారు. గతంలో ఆయనకు జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న అవమానాల వల్లే ఆయన స్థితి ఇలా తయారైంది" అంటూ తుమ్మల వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎక్కడికి వెళ్లినా ఒకే ఆవు కథ, ఒకే రికార్డింగ్ క్యాసెట్ వినిపించడం హరీశ్ రావుకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు.

సీతారామ సాగర్ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే హక్కు లేదని తుమ్మల అన్నారు. ఈ ప్రాజెక్టు తన రాజకీయ ఆకాంక్ష అని, దీనిని పూర్తి చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేంద్ర అనుమతులు లేకుండా రూ. 8 వేల కోట్లు ఖర్చు చేసిందని, కేవలం కమీషన్ల కోసమే లోపభూయిష్టమైన డిజైన్లతో పనులు చేపట్టారని ఆరోపించారు. హెడ్ వర్క్స్ లిఫ్ట్ కూడా పూర్తి చేయలేని స్థితిలో బీఆర్ఎస్ పాలన సాగిందని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో వంద కోట్లు వెచ్చించి గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తరలించామని, సత్తుపల్లి టన్నెల్ కోసం మరో రూ. 1,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి వివరించారు. ప్రజలు బుద్ధి చెప్పి అధికారం నుంచి దూరం చేసినా బీఆర్ఎస్ నేతలకు ఇంకా అహంకారం తగ్గలేదని తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కేసీఆర్ పగటి కలలు మానుకోవాలి..

మొదటిపేజీ తరువాయి

చేసే అభివృద్ధే సమాధానం చెబుతుందని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన ఈ సవాల్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. కేసీఆర్ పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం ఆ అవకాశమే ఇవ్వకూడదనే పట్టుదలతో ఉండటంతో రాబోయే రోజుల్లో ఈ పొలిటికల్ వార్ మరింత ముదిరేలా కనిపిస్తోంది.

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, ముఖ్యంగా కేసీఆర్ కుటుంబంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో తెలంగాణలో భారీ అవినీతి జరిగిందని, కమీషన్ల కోసమే ప్రాజెక్టుల పేర్లు, స్థలాలు మార్చారని ఆయన ఆరోపించారు. 2009లోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని సీఎం గుర్తు చేశారు. అయితే, కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులకు పేరు రాకూడదనే ఉద్దేశంతోనే కేసీఆర్ ప్రభుత్వం వాటి స్థలాలను, పేర్లను మార్చిందని మండిపడ్డారు. కేవలం ఆర్థిక లాభాలు, కమీషన్ల కోసమే ఈ రీడిజైన్ డ్రామా ఆడారని రేవంత్ రెడ్డి విమర్శించారు.

ప్రాజెక్టు నిర్మాణ సమయంలో జరిగిన ప్రచారాన్ని ఎద్దేవా చేస్తూ సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కాళేశ్వరం ప్రపంచంలోనే అద్భుతమని ప్రచారం చేసుకున్నారు. రాజకీయ లబ్ధి పొందేందుకు అప్పటి గవర్నర్ నరసింహన్‌తో హరీష్ రావు పేరును మార్చి 'కాళేశ్వర్ రావు' అని చెప్పించారు" అంటూ దుయ్యబట్టారు.



ప్రాజెక్టు గొప్పతనం కంటే వ్యక్తిగత ఇమేజ్ కోసమే అప్పట్లో ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు.

కేసీఆర్ చేసిన అవినీతిని కాలమే గుర్తించిందని, అందుకే 2023 ఎన్నికల ముందే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని సీఎం పేర్కొన్నారు. "కేసీఆర్ పాపాలను ప్రకృతే బయటకు తీసింది. ప్రపంచ అద్భుతం అని చెప్పిన ప్రాజెక్టు గాలిలో కలిసిపోయింది" అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అన్ని కోణాల్లోనూ విఫలమైందని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) తన నివేదికలో స్పష్టంగా పేర్కొందని సీఎం వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణం, నాణ్యత, ప్లానింగ్.. ఇలా ప్రతి విషయంలోనూ వైఫల్యాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ పర్యటనలో ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీఎం, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని మరోసారి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మంత్రులు, ఉన్నతాధికారులు , భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# రాష్ట్ర పునర్నిర్మాణం కేసీఆర్‌తోనే సాధ్యం

- అభివృద్ధికి రాజకీయాలు లేవు
- 10 జిల్లాల తెలంగాణ రాష్ట్రాన్ని 23 జిల్లాలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే
- రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కూడా కేసీఆర్‌దే
- కేసీఆర్ జగిత్యాలకు వస్తే.. అప్పుడే నిద్రలేచినట్టు రేవంత్ రెడ్డి నటిస్తున్నారు. -జీవన్ రెడ్డి

జగిత్యాల, (డిడి9 వార్త):

క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని తెలిపారు. కానీ 20 మాసాలు నా ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకాలం ఈ మానసిక క్షోభ భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలోపేతానికి నాలుగు దశబ్దాలు పోరాడితే చివరకు దక్కింది ఏంటి.. నా జీవితం చివరి దశలో ఈ మానసిక్ష క్షోభ ఏంటని భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమయంలో కేసీఆర్ నాకు చెయ్యిందించి అండగా ఉన్నారని తెలిపారు.

జగిత్యాలలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నా ప్రజా జీవితంలో ఇది ఒక మలుపుగా భావిస్తున్నానని రెడ్డి తెలిపారు. మీ అందరి అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చూపెట్టిన వివక్షతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. నేనేదో ఆశించి పార్టీ మారలేదని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో పదవులు చూశానని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని వీడాలని ఉద్దేశంతోనే పార్టీలో చేరానని చెప్పారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ సందర్భంలోనే కేసీఆర్



తనను పార్టీలోకి ఆహ్వానించారని జీవన్ రెడ్డి తెలిపారు. కానీ క్రమశిక్ష కలిగిన వ్యక్తిగా కాంగ్రెస్‌లోనే కొనసాగానని పేర్కొన్నారు. ఉద్యమ రథసారథిగా కేసీఆర్ తెలంగాణ సాధించారని అన్నారు. అలాంటి వ్యక్తితో పనిచేసే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు.

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిందని అన్నారు. కేసీఆర్ కల్యాణలక్ష్మి పేరుతో రూ. లక్ష ఆర్థిక సాయం చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. కానీ ఉన్న పథకాన్నే ఊడగొట్టే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని విమర్శించారు.

కేసీఆర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని తెలిపారు. బోర్నపల్లి నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాను చేసిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు. కేసీఆర్ జగిత్యాలకు మెడికల్ కాలేజీ ఇచ్చారని తెలిపారు. వైద్య సేవలను విస్తరించారని పేర్కొన్నారు. గురుకుల ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజనులకు రిజర్వేషన్లను కూడా పెంచారని అన్నారు.





# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- **రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి**
- **రైతులకు న్యాయం జరిగేలా అధికారులు సహకరించాలి**

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):**

బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో తెలంగాణ రాష్ట్ర మార్క్ఫెడ్ వారి ఆధ్వర్యంలో పీఏసీఎస్ బోథ్ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న రైతుకు ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... రైతులకు న్యాయం జరిగేలా అధికారులు సహకరించాలని, ఎండలో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని వీలైనంత త్వరగా పంటలను కొనుగోలు చేయాలని సూచించారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో తెలంగాణ రాష్ట్ర మార్క్ఫెడ్ వారి ఆధ్వర్యంలో పీఏసీఎస్ ఇచ్చోడ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న రైతుకు ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా




చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో ఎండల పట్ల జాగ్రత్తలు, త్రాగు నీరు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# బసవేశ్వరుని జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):**

బోథ్ మండలంలోని కౌట బి గ్రామంలో జరిగిన బసవేశ్వరుని జయంతి కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 12వ శతాబ్దపు గొప్ప సంఘ సంస్కర్త, కవి మరియు లింగాయత ధర్మ స్థాపకుడు బసవేశ్వరుడు (క్రీ.శ. 11311196). కుల వివక్ష, స్త్రీపురుష అసమానతలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడి, "కాయకవే కైలాస" (పనియే కైలాసం) దేహమే దేవాలయం అనే నినాదంతో సామాజిక సమనతను ప్రబోధించారు కేసిఆర్ ప్రభుత్వ హయాంలో వారి సేవలను గుర్తించి బసవేశ్వరుని జయంతి అధికారికంగా ప్రకటించారు అని ట్యాంక్ బండ్ పై బసవేశ్వరుని విగ్రహం ఏర్పాటు చేశారని కౌఠ బి గ్రామంలో బసవేశ్వరుని జయంతి వేడుకల్లో కోనియడారు ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజ నాయకులు సర్పంచ్ స్వామి వెండి సోమేశ్వర్ ఉప సర్పంచ్ రమణ రెడ్డి, నాయకులు రాంరెడ్డి సాగర్ రెడ్డి,కోంకటి గంగాధర్ గడ్డల శంకర్ స్వామి వివేకానంద యూత్ సభ్యులు యువకులు పాల్గొన్నారు



# వృద్ధుడి దయనీయ పరిస్థితి సహాయం కోసం ఎదురు చూపులు

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):**

అన్నెల బుమన్న తండ్రి రాజన్న బోథ్ మండలం కౌఠ గ్రామం లో లో నివసిస్తున్న ఒక వృద్ధుడు దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నాడు. కుటుంబ సభ్యుల సహాయం లేకుండా, చిన్న గదిలో ఒంటరిగా జీవనం సాగిస్తున్న ఈ వృద్ధుడు రోజువారీ అవసరాలను తీర్చుకోవడంలో ఇబ్బందులు పడుతున్నాడు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ కూడా తగిన వైద్యసేవలు అందకపోవడం ఆయన పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. సాదాసీదా జీవితం గడుపుతున్న ఈ వృద్ధుడు ప్రస్తుతం ఆర్థికంగా కూడా బలహీనంగా ఉన్నాడు. ఇంట్లో ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం, సరైన పోషకాహారం అందకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి సహాయం అందిం



చాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ప్రభుత్వ అధికారులు కూడా స్పందించి, వృద్ధుడికి అవసరమైన పెన్షన్, వైద్యసాయం, మరియు ఇతర సంక్షేమ పథకాల ద్వారా మద్దతు ఇవ్వాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేషానికి హాజరయిన

# గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ .

- **అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం**

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):**

నెరడిగొండ మండలంలోని బుద్దికొండ గ్రామంలో నూతనంగా గొల్ల నారాయణ గారు నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృ ప్రవేశానికి ముఖ్యఅతిథిగా గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారు హాజరయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారు మాట్లాడుతూ.. అర్హులందరికీ రెండవ విడతలో ఇల్లు అందేలా కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ఇండ్లను త్వరతరగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):**

బజార్ హత్నూర్ మండలంలోని రైతు వేధికలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 31 మందికి కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చెక్కుల వేరిఫైలను అధికారులు ఆలస్యం చేయొద్దని, తన దగ్గరకు వచ్చిన రోజే సంతకం చేసే బాధ్యత తనదని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# అంత్యక్రియల ఖర్చుల కొరకు ఆర్థిక సహాయం

- **కోనేరు శశాంక్**

**నిజామాబాద్ కోటగిరి ఏప్రిల్ 20(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామంలో వార్డు మెంబర్ బీజేపీ బూత్ అధ్యక్షుడు మల్లెపూల నాగరాజు గారి తండ్రి గారు మల్లెపూల విఠల్ గారు (68 ) అకాల మరణం చెందడం జరిగింది, విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు కోనేరు శశాంక్ వెళ్ళి పరామర్శించి అంత్యక్రియల కోసం 5000 ఆర్థిక సహాయం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏముల నవీన్ రుద్రూర్ అధ్యక్షులు ఆలపాటి హరి కృష్ణ ,జనరల్ సెక్రటరీ సాయి కుమార్ గౌడ్ ,విష్ణు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు...



# రైతులు పత్తి విత్తనాలను కొనుగోలు

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 20(డిడి9 వార్త):-**

బోథ్ మండల కేంద్రంలో అక్షయ తృతీయ నాడు విత్తనాలు కొనడం లేదా విత్తడం చాలా శుభప్రదంగా భావిస్తారు. ముఖ్యంగా ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో, రైతులు పత్తి, సోయా వంటి విత్తనాలను బంగారంలా భావించి, ఈ రోజు కొనుగోలు చేసి, వానాకాలం సాగుకు శ్రీకారం చుడతారు. ఈ రోజు నాటిన పంటలు మంచి దిగుబడిని ఇస్తాయని, సంపదను పెంచుతాయని నమ్ముతారు. పత్తి రైతులను అక్షయ తృతీయ సెంటిమెంట్ పట్టుకుంది. అయితే మిగతా వారిలాగే, వారు బంగారాన్ని కొనుగోలు చేయలేదు, కానీ భవిష్యత్తులో తమ పై పంట భారీ సిరులు కురిపిస్తుందనే ఆశతో తెల్ల బంగారం పత్తి విత్తనాలను కొనుగోలు చేసారు .





# బాధితుల చెంతకు పోలీస్ సేవలు

- **ప్రజావాణిలో 34 ఫిర్యాదుల స్వీకరణ**

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 20(డీడీ9 వార్త):**

ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేసేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోంది. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య స్వయంగా పాల్గొని బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన 34 ఫిర్యాదులను పరిశీలించి, వాటి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల ఎస్ఐలు, సీఐలతో ఫోన్లో మాట్లాడారు. చట్ట పరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు సేవలను పొందేందుకు ప్రజలు ఎలాంటి మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, పైరవీలకు తావులేకుండా నిర్భయంగా ముందుకు రావాలని సీపీ సూచించారు. "ప్రజలకు అండగా ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షించడమే మా లక్ష్యం. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ద్వారా బాధితులకు నేరుగా భరోసా కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

- **చలివేంద్రం ప్రారంభిస్తున్న కోనేరు శశాంక్**

**నిజామాబాద్ కోటగిరి ఏప్రిల్ 20 (డిడి9 వార్త):**

నిజామాబాద్ కోటగిరి మండల కేంద్రంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం వేసవికాలంలో బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛందంగా చలివేంద్రం ప్రారంభించారు, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఎన్నారై కోనేరు శశాంక్, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బర్ల మధుకర్ ప్రారంభించారు, ఈ సందర్భంగా రామకృష్ణ సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు మరువలేనివని, ప్రతి సంవత్సరం గత 15 సంవత్సరముల నుండి నిర్విరామంగా స్వచ్ఛందంగా సేవలందించడం అభినందనీయమని శశాంక్ పేర్కొన్నారు, మల్లారెడ్డి శ్వేత శ్రీనివాస్ రెడ్డి దంపతుల కుమార్తె చిరంజీవి చందన హైదరాబాద్, వివేకానంద పాఠశాల కోటగిరి వారి సౌజన్యంతో మజ్జిగ , చల్లటి మంచినీరు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు శివ శ్రీనివాస్ తెలిపారు,



# నలుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి


**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 20(డీడీ9 వార్త):**




జిల్లా పోలీస్ శాఖలో కానిస్టేబుళ్లుగా సేవలందిస్తున్న నలుగురు సిబ్బంది పదోన్నతి పొందారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని నలుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో పదోన్నతి పొందిన సిబ్బంది సోమవారం జిల్లా పోలీస్ కమిషనర్ శ్రీ పి.సాయి చైతన్యను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ వారిని అభినందిస్తూ.. ఉన్నత హోదాలో మరింత బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రమోషన్ పొందిన వారిలో వర్ని పోలీస్ స్టేషన్‌కు చెందిన కె.ఆనంద్ (పీసీ 1736), టౌన్2కు చెందిన వి.సతీష్ (పీసీ 1729), ధర్పల్లి పీఎస్‌కు చెందిన కె.నవీన్ కుమార్ (పీసీ 1712), టౌన్1కు చెందిన శశి ప్రసాద్ (పీసీ 966) ఉన్నారు. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతి దక్కడంతో సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భైరాపూర్ గ్రామంలో నెలరోజులుగా మిషన్ భగీరథ నీళ్లు నిలిచివేత – ప్రజావాణిలో ఫిర్యాదు

**బీర్కూర్, ఏప్రిల్ 20(డిడి9 వార్త):**
బీర్కూర్ మండలం భైరాపూర్ గ్రామానికి గత నెల రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయిందని గ్రామస్థులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పలుమార్లు మిషన్ భగీరథ అధికారులకు విన్నవించినా ఎలాంటి స్పందన లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే వేసవి తీవ్రత పెరిగి ఎండలు మండుతున్న తరుణంలో, కనీస అవసరాలకు కూడా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి దారుణంగా మారిందని, తాగునీటి కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భైరాపూర్ గ్రామానికి వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.



## వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- **సాలురాలో నమూనా గృహానికి భూమిపూజ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 20(డీడీ9 వార్త):**
సాలుర మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ ఇప్పటికే పలుచోట్ల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, తాజాగా సోమవారం మండల కేంద్రంలో నమూనా గృహ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. పీసీసీ డెలిగేట్ గంగ శంకర్ ముఖ్య అతిథిగా హాజరై నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని, లబ్ధిదారులు నాణ్యతతో కూడిన గృహాలను నిర్మించుకునేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, గడువులోగా గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ..నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నమూనా గృహం ద్వారా నిర్మాణంలో పాటించాల్సిన ప్రమాణాలను లబ్ధిదారులకు వివరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నవాజ్, వివిధ గ్రామాల సర్పంచులు సొక్కం లావణ్య, శివ కుమార్, సతీష్, నాగయ్య, ఉప సర్పంచ్ బయ్యన్ సురేష్, కాంగ్రెస్ నాయకులు మందర్న రవి, అల్లే రమేష్, సొక్కం రవి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి పనుల వద్ద వసతులు కల్పించాలి : ఎంపీడీవో శ్రీనివాస్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 20(డీడీ9 వార్త):**
సాలుర మండలం సాలుర క్యాంప్ చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీఓ శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పని ప్రదేశంలో కూలీల సంఖ్యను పరిశీలించి, ఎండల తీవ్రత దృష్ట్యా కూలీల హాజరు శాతాన్ని మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో పనుల వద్ద కూలీలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా పని ప్రదేశంలో కూలీల కోసం తాగునీటి సౌకర్యాన్ని మెరుగుపరచాలని, ఎండ దెబ్బ తగలకుండా నీడ వసతి కల్పించాలని ఆదేశించారు. ఏదైనా ప్రమాదం లేదా అస్వస్థత తలెత్తినప్పుడు తక్షణ ఉపశమనం కోసం ప్రతి పని ప్రదేశంలో ఖచ్చితంగా ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం కూలీలకు రావాల్సిన అన్ని సదుపాయాలను కల్పించడంలో నిర్లక్ష్యం వహించవద్దని, పనుల్లో నాణ్యతతో పాటు కూలీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.








## తుంకుంటలో చలి వేంద్రాల ఏర్పాటు...!

- **బాటసారులకు చల్లని నీరు, మజ్జిగ పంపిణీ...**
- **మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్ యాదవ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం...**
- **వేసవి ఎండలలో దాహం తీర్చే ప్రయత్నం...**
- **రాజీవ్ రహదారిపై బస్ స్టాప్‌ల వద్ద ఏర్పాటు...**
- **ప్రయాణికులకు ఉపశమనం కలిగించిన సేవ...**
- **తాగునీరు, మజ్జిగ అందిస్తూ ఆదర్శంగా నిలిచిన నాయకుడు...**
- **ప్రతి ప్రయాణికుడి దాహం తీర్చడమే లక్ష్యం...**
- **స్థానికుల నుంచి ప్రశంసలు వెల్లువ...**

**శామీర్‌పేట, ఏప్రిల్ 19 (డిడి9 వార్త):**
మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 300వ డివిజన్ తుంకుంట పట్టణంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలి వేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం రాజీవ్ రహదారిపై బస్ స్టాప్‌ల వద్ద వెళ్లే బాటసారులకు, ప్రయాణికులకు మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్ యాదవ్ చల్లని తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. తీవ్రమైన ఎండల్లో ప్రయాణించే ప్రజలు దాహంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. వేసవికాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై ప్రయాణించే ప్రజలకు తాగునీరు, మజ్జిగ వంటి శీతల పదార్థాలు అందించడం ద్వారా కొంత ఉపశమనం కలుగుతుందని చెప్పారు. ప్రతి ప్రయాణికుడి దాహం తీర్చడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని కోరుతున్నారు. తుంకుంటలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాలు ప్రస్తుతం బాటసారులకు ఉపశమనం కలిగిస్తున్నాయి.




## క్రీడలతోనే మానసిక ఉల్లాసం















- **జిల్లా జడ్జి భారతి లక్ష్మి, సీపీ సాయి చైతన్య**
- **ఉత్సాహంగా ప్రారంభమైన ఎన్.ఎస్.సి క్రికెట్ టోర్నమెంట్**

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 20(డీడీ9 వార్త):**
యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొన్నప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.వి.ఎం. భారతలక్ష్మి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య లు పేర్కొన్నారు. నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని మహిళా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన నిజామాబాద్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం వారు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుల ఒత్తిడికి లోనవుతున్నారని, అటువంటి తరుణంలో క్రీడలు వారిని శారీరకంగా, మానసిక ఉత్తేజితం చేస్తాయని వివరించారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృధా చేయకుండా, చెడు అలవాట్లకు లోనుకాకుండా ఉండేందుకు నిత్యం ఏదో ఒక క్రీడను అలవర్చుకోవాలని సూచించారు. పోలీస్, న్యాయశాఖ వంటి విభాగాల్లో పని చేసే ఉద్యోగులు విధి నిర్వహణలో ఎంతో ఒత్తిడి ఎదుర్కొంటారని, వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని జడ్జి భారతలక్ష్మి అభిప్రాయపడ్డారు. సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ.. ఉద్యోగ బాధ్యతలు మానసిక శక్తిని హరిస్తాయని, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఆటల పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఈ నెల 28 వరకు కొనసాగే ఈ పోటీలను క్రీడాభిమానులు 'క్రిక్ హీరోస్' యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో వీక్షించే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో పోలీస్ XI మరియు జ్యుడిషియల్ XI జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పోలీస్ XI జట్టు నిర్ణీత 8 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 81 పరుగులు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన జ్యుడిషియల్ XI జట్టు 8 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి కేవలం 37 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో 44 పరుగుల భారీ తేడాతో పోలీస్ XI జట్టు ఘన విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు బస్వా రెడ్డి, రామచంద్రరావు, ఎన్.ఎస్.ఈ కార్యవర్గ సభ్యులు డాక్టర్ కవిత రెడ్డి, సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, జడ్జిలు దుర్గాప్రసాద్, నారాయణ, గోపి కృష్ణతో పాటు వివిధ విభాగాల ఏసీపీలు, సీఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానాలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 20(డీడీ9 వార్త):**
ముదక్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో గల బస్తీ దవాఖానాను నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రాజశ్రీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానాలోని ఓపీ రిజిస్టర్, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... ప్రస్తుత వేసవి దృష్ట్యా ప్రజారోగ్యం పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్న చిన్నపిల్లలు, గర్భిణీలు, వయోవృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఉద్యోగులందరూ ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించి విధులకు గైర్హాజరయ్యే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపకేంద్ర పరిధిలో నిర్దేశించిన ఆరోగ్య లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని వైద్య సిబ్బందిని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎక్కడా రాజీ పడకూడదని ఆమె పేర్కొన్నారు.





## హస కొత్తూరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 20(డీడీ9 వార్త):**
కమ్మర్‌పల్లి మండలంలోని హస కొత్తూరు గ్రామంలో సొసైటీ చౌట్‌పల్లి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం గ్రామ సర్పంచ్ నలిమెల రేవతి గంగారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా, ప్రభుత్వం కల్పించిన కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర పొందాలని కోరారు. ధాన్య సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సొసైటీ ద్వారా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఏనుగు మనోహర్, సొసైటీ సీఈఓ శంకర్, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ గడ్డం శ్రీధర్, మాజీ సొసైటీ డైరెక్టర్ ఏనుగు దేవాయి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కుందేటి శ్రీనివాస్, నాయకులు పడిగేల ప్రవీణ్, గోపిడి లింగారెడ్డి, ఎడ్ల శ్రీకాంత్‌తో పాటు పలువురు రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# బయోపిక్ కోసం భారీ రిస్క్ చేస్తున్న యంగ్ బ్యూటీ?

మలయాళ ముద్దుగుమ్మ మమిత బైజు 'ప్రేమలు' సినిమాతో ఓవర్‌నైట్ సెన్సేషన్‌గా మారిపోయింది. ఆ మూవీలో తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రకారు మనసు దోచుకున్న ఈ భామ, ప్రస్తుతం సౌత్ ఇండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. కేవలం మలయాళంలోనే కాకుండా, ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలలో స్టార్ హీరోల సరసన క్రేజీ ఆఫర్లు దక్కించుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉంది. మమిత బైజు ప్రస్తుతం ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య సరసన 'విశ్వానాథ్ అండ్ సన్స్'లో కథానాయికగా నటిస్తోంది. అలాగే, దళపతి విజయ్ ఆఖరి చిత్రం 'జన నాయగన్'లో ఒక కీలక పాత్రలో కనిపించబోతోంది. ఇక ఆమెకు లైఫ్ ఇచ్చిన 'ప్రేమలు' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'ప్రేమలు-2'లో కూడా మమిత నటిస్తుండటంతో అభిమానుల అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కోలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ ధనుష్ సరసన 'కారా' చిత్రంలో కూడా ఆమె నటిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్ ఏప్రిల్ 30న థియేటర్లలోకి రాబోతోంది. ఇందులో మమిత 'సెల్లి' అనే పాత్రలో ఒక విభిన్నమైన లుక్‌లో కనిపించబోతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మమిత, ధనుష్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "నేను మొదటి నుంచీ ధనుష్ గారి నటనకు పెద్ద అభిమానిని. ఆయన సినిమాల్లోని డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్‌ను నేను చాలా నిశితంగా గమనిస్తుంటాను. 'కారా' సెట్స్‌లో ఆయనతో కలిసి నటించడం నాకు ఒక యాక్టింగ్ స్కూల్‌లో ఉన్నట్లు అనిపించింది. ఆయన సెట్స్‌లో తన సహనటులకు ఎంతో స్వేచ్ఛను, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తారు. ఆయన నుంచి నటనలో ఎన్నో మెళకువలు నేర్చుకున్నాను. ధనుష్ సర్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం నా అదృష్టం" అని మమిత చెప్పుకొచ్చింది. మొత్తానికి, 'ప్రేమలు' పిల్ల తన టాలెంట్‌తో సౌత్ సినిమా ఇండస్ట్రీని ఒక ఊపు ఊపేస్తోంది. అటు గ్లామర్, ఇటు పర్ఫార్మెన్స్‌తో మెప్పిస్తున్న మమిత, భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సృష్టించడం ఖాయమని నెటిజన్లు అంటున్నారు.



# ఇది మైలురాయి మాత్రమే కాదు..: పూరి జగన్నాథ్‌పై విజయ్ ప్రశంసలు

తన మార్క్ డైలాగులతో ఇండస్ట్రీలో స్టార్ దర్శకుల జాబితాలో స్థానం సొంతం చేసుకున్నారు దర్శకుడు పూరి జగన్నాథ్. ఆయన ఇండస్ట్రీకి వచ్చి నేటికి 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయ్ సేతుపతి ఆయనపై ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం వీరిద్దరి కాంబినేషన్‌లో 'స్లమ్ డాగ్' చిత్రం రూపొందుతోంది. ఈనేపథ్యంలో ఆయనతో తనకున్న అనుబంధాన్ని, ఆయన పనితీరును కొనియాడుతూ విజయ్ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ఇది నెట్టింట వైరల్ అవుతుండగా పూరి జగన్నాథ్ అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

''మీదో అద్భుతమైన ప్రయాణం. సినీ రంగంలో 26 ఏళ్లు పూర్తిచేసుకోవడం కేవలం మైలురాయి మాత్రమే కాదు.. ధైర్యం, నమ్మకం, నిర్భయంతో మీరు నిర్మించుకున్న కోట. మీ దర్శకత్వంలో 'స్లమ్ డాగ్'లో నటించడం నాకు దక్కిన గౌరవం. నటులను నమ్మి, వారిని కంఫర్ట్ జోన్ నుంచి బయటకు తీసుకువచ్చి ప్రతిభను వెలికితీసే దర్శకుల కోసం నేను ఎప్పుడూ ఎదురుచూస్తుంటా. మీరు ఆ పనిని చాలా సునాయాసంగా చేస్తారు. మనందరికీ ఇదొక ప్రత్యేకమైన సినిమాగా నిలిచిపోతుందని నమ్ముతున్నాను. మీరు మరిన్ని విజయాలు అందుకోవాలని, ఇంకా ఎన్నో ఏళ్లపాటు మీ కథలతో మమ్మల్ని ఆకట్టుకోవాలని కోరుకుంటున్నాను'' అని విజయ్ పోస్ట్ పెట్టారు. 2000లో పవన్ కల్యాణ్ 'బద్రి' సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు పూరి జగన్నాథ్. ఆ తర్వాత 'అమ్మా.. నాన్న.. ఓ తమిళ అమ్మాయి', 'శివమణి', 'పోకిరి', 'దేశముదురు' లాంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలు రూపొందించారు. ప్రస్తుతం విజయ్ సేతుపతితో కలిసి 'స్లమ్ డాగ్' తెరకెక్కిస్తున్నారు.



# వరుణ్‌తో కృతి ఆటాపాట?

'తేరే ఇష్క్ మే' చిత్రంతో గతేడాది ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ కథానాయిక కృతి సనన్. ఈ సంవత్సరం కూడా అదిరిపోయే సినిమాలతో అలరించడానికి ముస్తాబవుతోందీ తార. ఇందులో భాగంగానే ఆమె ఇప్పుడొక ప్రత్యేక పాటలో చిందులేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. వరుణ్ ధావన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే కథానాయికలు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్లకు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఇందులో కృతి ఓ ప్రత్యేక గీతంలో వరుణ్‌తో కలిసి ఆడిపాడనుందట. ఇప్పటికే ఈ పాట చిత్రీకరణ పూర్తయినట్లు, ఇదొక కామెడీ ట్రాక్‌లా ఉంటుందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. డేవిడ్ ధావన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం వచ్చే నెల 22 థియేటర్లలోకి రానుంది.





# 'కర' దొరికిపోతాడా?

''ఓ రాత్రి అతను ఒక బ్యాంకులోకి చొరబడి.. దోచుకున్నాడు. కానీ అతను అక్కడితో ఆగలేదు. మరుసటి రోజే.. పట్టపగలే మరో బ్యాంకును దోచుకున్నాడు. అంటే అతనికి కచ్చితంగా ఏదో అవసరం ఉండి ఉంటుంది'' అంటూ 'కర' సినిమా ప్రపంచాన్ని పరిచయం చేసింది చిత్రబృందం. ధనుష్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించారు. మమితా బైజు కథానాయిక. ఈశారీ కె.గణేశ్ నిర్మించారు. ఈనెల 30న రానుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో డబ్బును దోచుకునే దొంగలా సరికొత్త అవతారంలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు ధనుష్. ''అతను ఈరోజు కచ్చితంగా దొరికిపోతాడు'' అంటూ ట్రైలర్‌లో ఆఖర్లో వినిపించిన సంభాషణ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తుంది.

# చిరు – బాబీ 'కాకాజీ'.. ఫైనలా?

'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత.. మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో మరో సెన్సేషనల్ మాస్ ప్రాజెక్ట్ సిద్ధమవుతోంది. మెగా 158 వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలు కానుంది. అయితే, ఈ చిత్రానికి 'కాకాజీ' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. గతంలో కాకాజీతో పాటు కాకా అనే టైటిల్ కూడా వినిపించగా.. లేటెస్ట్‌గా కాకాజీ ఆల్మోస్ట్ ఫైనల్ అయిందనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అలాగే, ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో నటించబోతున్నట్టుగా తెలుస్తోంది.

కానీ, ఈ చిత్రంలో చిరంజీవి గతంలో ఎన్నడూ చూడని లుక్‌లో కనిపించబోతున్నారట. బాబీ స్క్రిప్ట్ ప్రకారం, ఇందులో కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా, బలమైన ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఉంటాయని తెలుస్తోంది. మెగాస్టార్ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా, మాస్ ఆడియన్స్‌ను ఉర్రూతలూగించే డైలాగ్స్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లతో స్క్రిప్ట్ సిద్ధం చేశాడట బాబీ. స్క్రిప్ట్ విషయంలో చిరంజీవి కూడా చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నట్లు సమాచారం. 'వాల్తేరు వీరయ్య'తో చిరంజీవిలోని మాస్ యాంగిల్‌ను పర్ఫెక్ట్‌గా ప్రెజెంట్ చేసిన బాబీ, ఈసారి 'కాకాజీ'తో ఆ డోస్‌ను మరింత పెంచబోతున్నారట. ముఖ్యంగా క్లైమాక్స్‌లో వచ్చే ఒక భారీ ట్విస్ట్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని, చిరంజీవిఅనిల్ కపూర్ మధ్య వచ్చే సీన్స్ థియేటర్లలో 'పూనకాలు' తెప్పిస్తాయని టాక్ వినిపిస్తోంది. KVN ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తోంది.




# సినిమాలు ఫుల్.. హిట్స్ నిల్.. ఈసారి హిట్ కొట్టకుంటే కష్టమే

టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ ప్రస్తుతం కెరీర్ పరంగా అత్యంత కీలకమైన దశలో ఉన్నారు. 'టాక్సీవాలా' వంటి సక్సెస్ తర్వాత ఈ రౌడీ హీరోకి బాక్సాఫీస్ వద్ద సరైన హిట్ పడలేదు. 'డియర్ కామ్రేడ్' నుండి మొదలై 'వరల్డ్ ఫేమస్ లవర్', భారీ అంచనాలతో వచ్చిన 'లైగర్', ఆ తర్వాత 'ఖుషి', 'ఫ్యామిలీ స్టార్', 'కింగ్‌డమ్'.. ఇలా వరుసగా సినిమాలు చేస్తున్నాఅవి ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదు. కింగ్‌డమ్ డిజాస్టర్ విజయ్ కెరీర్ పై ఎఫెక్ట్ చూపించింది. టాలీవుడ్ టైర్ 2 హీరోల రేసులో విజయ్ వెనకబడుతున్నారనే చర్చ ఫిలింనగర్‌లో మొదలైంది.

వరుస పరాజయాలు ఎదురవుతున్నా విజయ్ దేవరకొండ మీద నమ్మకంతో నిర్మాతలు, దర్శకులు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో మూడు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. 'రాజావారు రాణిగారు' ఫేమ్ రాజ్ కిరణ్ కోలా దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, కీర్తి సురేష్ జంటగా నటిస్తున్న 'రౌడీ జనార్ధన్' అనే కంప్లీట్ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే మాస్ యాక్షన్ మూవీ చేస్తున్నాడు. తన పాత మిత్రుడు 'టాక్సీవాలా' దర్శకుడు రాహుల్ సంకృత్యాన్‌తో కలిసి విజయ్ 'రణబాలి' అనే చిత్రాన్ని చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాను సెప్టెంబర్ 11న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. వరుస ఫ్లాపుల తర్వాత వస్తున్న ఈ సినిమాలపై విజయ్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు లేటెస్ట్‌గా హాయ్ నాన్న సినిమాతో తన టాలెంట్ నిరూపించుకున్న డైరెక్టర్ శౌర్యువ్ దర్శకత్వంలో విజయ్ ఒక సినిమా చేస్తున్నారు.



ఈ మూడు సినిమాలు విజయ్ కు ఎంతో కీలకం. టైర్ 2 రేసులో తన స్థానాన్ని పదిలపరుచుకోవాలంటే ఈ సినిమాల్లో కనీసం ఒకటి రెండు చిత్రాలు భారీ వసూళ్లు సాధించాల్సిందే.

# నటిని కాకపోయి ఉంటే పిల్లలతో ఉండేదాన్ని

నటి దీపికా పదుకొణె రెండోసారి తల్లి కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గతంలో ఆమె పిల్లల గురించి చేసిన ఆసక్తికర కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తను నటి కాకపోయి ఉంటే ఎలా ఉండేవారో గతంలో పంచుకొన్న విషయాలను ఫ్యాన్స్ షేర్ చేస్తున్నారు. ''ఒకవేళ నటిని కాకపోయి ఉంటే, ఏం చేసేదాన్నో నాకు తెలియదు. కానీ చుట్టూ పిల్లలతో ఉండి ఉండేదాన్ని. ముగ్గురు చిన్న పిల్లలు నా చుట్టూ అటు, ఇటు పరిగెత్తుతూ ఉంటే చూడాలని ఉంది. ఇప్పుడు కూడా నా పనిని కొనసాగిస్తూనే, పిల్లలను షూటింగ్ సెట్స్‌కు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను. కుటుంబంతో ఎప్పుడూ సంతోషంగా గడపడం నాకు ఇష్టం'' అని తెలిపారు. ఇక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ సమయంలోనూ దీపికా పిల్లల గురించి మాట్లాడారు. తనకు చాలామంది పిల్లలు, మనవరాళ్లు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దీపికా పదుకొణె 'కింగ్', 'రాకా' చిత్రాల్లో నటిస్తున్నారు. రెండూ భారీ బడ్జెట్‌తో ముస్తాబవుతున్నాయి. తాజాగా ఆమె ప్రకటనతో ఈ రెండు చిత్రాల పరిస్థితిపై ఫ్యాన్స్ పోస్ట్‌లు పెడుతున్నారు. అప్‌డేట్ ఇవ్వాలంటూ చిత్రబృందాన్ని ట్యాగ్ చేస్తున్నారు. షారుక్ ఖాన్ హీరోగా సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో 'కింగ్' తెరకెక్కుతోంది. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా రూపొందుతున్న 'రాకా' రానుంది.

